క్లుప్తంగా

లారీ ఢీకొని ఇంటి ముందు ఒరిగిన స్తంభం



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల పరిధిలోని రైలుపేట రైల్వేగేటు వద్ద ఓ లారీ శనివారం స్తంభానికి ఢీకొట్టడంతో ఇంటి ముందు వాలింది. సేకరించిన వివరాల ప్రకారం... దుగ్గిరాల రైలుపేటలోని రైల్వేగేటు సమీపంలో ముత్యాల రాంబాబు ఇంటి ముందు ఫైబర్ నెట్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున గుర్తు తెలియని లారీ ఢీకొట్టడంతో అది ఇంటి గుమ్మంలో పడిపోయింది. ఇంట్లోంచి బయటకు రావడం కష్టంగా ఉందని, వెంటనే పంచాయతీ అధికారులు కలుగజేసుకుని ఆ స్తంభాన్ని తొలగించాలని రాంబాబు కోరారు.

చిరు వ్యాపారికి టిఫిన్ బండి అందజేత



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడుకు చెందిన చిరు వ్యాపారికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆర్థిక సహకారంతో టిఫిన్ బండిని అందజేశారు. గ్రామానికి చెందిన కొప్పుల రాజేష్ అనే చిరు వ్యాపారి తనకు టిఫిన్ బండిని ఇప్పించాలని స్థానిక పార్టీ నాయకుల ద్వారా ఎమ్మెల్యే ఆర్కేను కోరారు. స్పందించిన ఆయన శనివారం పార్టీ నాయకుల చేతుల మీదుగా రాజేష్‌కు టిఫిన్ బండిని అందజేశారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, గ్రామ సర్పంచి పలుకూరు మేరమ్మ పాల్గొన్నారు.

వడ్డేశ్వరం వాటర్ ట్యాంక్‌కు మరమ్మతులు



తాడేపల్లి రూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో పంచాయతీ తాగునీటి ట్యాంకు లీకై నీరు వృథాగా పోతోంది. దీంతో కార్పొరేషన్ అధికారులు శనివారం మరమ్మతులు చేపట్టారు. ట్యాంక్ సిమెంట్ కాంక్రీటు పెచ్చులు పెచ్చులుగా ఊడటంతో ముందుగా శాండ్ బ్లాస్టింగ్ ద్వారా వాటిని తొలగిస్తున్నారు. అనంతరం సిమెంటు, ఇసుక మిశ్రమంతో గన్ ఫిల్లింగ్ పద్ధతిలో మరమ్మతులు చేపట్టనున్నారు. మరమ్మతులు పూర్తయితే వడ్డేశ్వరానికి అదనంగా మరో లక్ష లీటర్ల నీటిని అందించవచ్చునని డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

పేద కుటుంబానికి నిత్యావసర సరుకుల పంపిణీ



మంగళగిరి: విజయ హెల్త్ కేర్ ట్రస్ట్– బీసీ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని కరివేపాకు బజారులోని నిస్సహాయ స్థితిలో ఉన్న ఓ కుటుంబానికి నిత్యావసర సరుకులు, గ్యాస్ పొయ్యిని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ సీఈఓ కాగితాల స్వాతి, నియోజకవర్గ జాయింట్ సెక్రటరీ తిరువీధుల కిరణ్, మాదు నాగదుర్గ, మంద్రు సత్యనారాయణ, మధు వెంకటేశ్వరరావు, నాగబాబు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజ స్తంభ ప్రథమ వార్షికోత్సవం

ఫిరంగిపురం: స్థానిక శ్రీ కాళహస్తీశ్వరస్వామి ఆలయంలో నూతన జీవ ధ్వజ స్తంభ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామికి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, నమక చమకాలతో విశేష పూజలు చేశారు. అనంతరం జీవ ధ్వజ స్తంభానికి అర్చనలు, నవగ్రహ మండపంలోని నవగ్రహ దేవతలకు అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ అర్చనలు నిర్వహించారు. భక్తుల గోత్రాలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అభివృద్ధి పనుల్ని వేగవంతం చేయండి !

- అధికారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సూచన
- నగరంలో విస్తృత పర్యటన



యర్రబాలెంలో బీటీ రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలో కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగ అధికారులకు సూచించారు. శనివారం ఆయన కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్ని నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగ అధికారులతో కలసి పరిశీలించారు. కార్పొరేషన్ పరిధి చినకాకాని వై. జంక్షన్ కూడలి నేతన్న సర్కిల్ వద్ద జరుగుతున్న నేతన్న విగ్రహం ఏర్పాటు పనుల్ని పరిశీలించారు. సెప్టెంబరు ఒకటో తేదీ నాటికి విగ్రహం ఏర్పాటుతో పాటు నేతన్న సర్కిల్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం కార్పొరేషన్ పరిధి యర్రబాలెంలో మూడు కోట్ల రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్ని పరిశీలించారు. బసవతారకనగర్‌లో రూ.1.05 కోట్లతో ఇటీవల పూర్తయిన రెండు సీసీ రోడ్ల నిర్మాణాల్ని పరిశీలించారు. ఇరువైపులా కచ్చా కాలువలు తీయించి మురుగునీటి పారుదలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇదే ప్రాంతంలో మిగిలిన మరో నాలుగు గ్రావెల్ రోడ్లను వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. పొగాకు కంపెనీ నుంచి బసవతారకనగర్ మీదుగా చెరువు వరకు రూ.1.75 కోట్లతో ప్రతిపాదిత బీటీ రహదారి పనుల్ని వెంటనే ప్రారంభించాలని తెలిపారు. మార్కెట్ యార్డు రోడ్డు వెంబడి సుమారు రూ.1.65 కోట్లతో జరుగుతున్న సీసీ డ్రైనేజీ నిర్మాణాన్ని పరిశీలించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా కల్వర్టులు నిర్మించాలన్నారు. అనంతరం ముస్లిం శ్మశానవాటికలో రూ.30లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో భాగంగా జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణాల్ని పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం కాలినడకన రామాలయం సెంటర్‌కు చేరుకున్నారు. రూ.1.70 కోట్లతో చేపట్టిన బీటీ రహదారి పనుల్ని పరిశీలించారు. పనులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణను సందర్శించారు. నాడు–నేడు ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల్ని పరిశీలించారు. అక్కడి నుంచి ఆయన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. వైద్య సిబ్బందిని రోగులకు అందిస్తున్న సేవల వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. రక్తహీనతతో బాధపడుతూ అర్బన్ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న మహిళను పరామర్శించి, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. హెల్త్ సెంటర్‌లో మందుల కొరత ఉందనే విషయాన్ని వైద్య సిబ్బంది ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే వీలైనంత త్వరలో సరఫరా అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బేతపూడి బాబూజీనగర్‌లో తుదిదశకు చేరుకున్న డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాలు నిర్మాణ పనుల్ని పరిశీలించారు. సెప్టెంబరు 10వ తేదీ నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం అంబేడ్కర్ నగర్‌లో తుదిదశకు చేరుకున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల్ని పరిశీలించారు. ఈనెల 31వ తేదీ నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం నిడమర్రు నుంచి బేతపూడి గ్రామానికి వెళ్లే మెయిన్ రోడ్డు నిర్మాణ పనుల్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిశోర్, పంచాయతీ కార్యదర్శి ఎం. కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు గుండాల శ్రీనివాసరావు, కాపరౌతు భాస్కరరావు, పలగాని కోటేశ్వరరావు, షేక్ షఫీ, షేక్ గౌస్, మేరిగ నాగేశ్వరరావు, రేమిణిశెట్టి గోపి, జాన్ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టర్ సాదియా అల్మాస్‌కు సత్కారం



మంగళగిరి: యూఏఈలోని షార్జాలో ఆగస్టు 17 నుంచి 21 వరకు జరిగిన ఆసియన్ యూనివర్సిటీ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో నాలుగు బంగారు పతకాలు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన సాదియా అల్మాస్‌కు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, రోటరీక్లబ్ ఆఫ్ మంగళగిరి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సత్కార గ్రహీత సాదియా అల్మాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి రోటరీ, రెడ్‌క్రాస్ సంస్థలు తనకు అందించిన సహాయ, సహకారాలపై కృతజ్ఞతలు తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంగళగిరి బ్రాంచి చైర్మన్ ఇసునూరి అనిల్ చక్రవర్తి మాట్లాడుతూ సాదియా అల్మాస్ మరెన్నో పతకాలు సాధించి దేశ ప్రతిష్ఠను పెంచాలని ఆకాంక్షించారు. రోటరీ క్లబ్ సెక్రటరీ గాజుల శ్రీనివాసరావు మాట్లాడుతూ సాదియా అల్మాస్‌కు ఆర్థిక సహాయం చేయడానికి రోటరీ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో అందె మురళి, కోచ్ ఎస్‌కే సంధానీతో పాటు పలువురు రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

ఏడాదిలోగా టీటీడీ ఆలయ అభివృద్ధి

తాడికొండ: ఏడాదిలోగా గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటపాలెం టీటీడీ ఆలయాన్ని ప్రభుత్వం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తుందని గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తెలిపారు. ఆలయాన్ని శనివారం సందర్శించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆలయంలో మాడ వీధులు, పూజారి వసతి గృహాలు, వంటశాల పూర్తయితే పూర్తిస్థాయి వసతులు వస్తాయని తెలిపారు. ఇప్పటికే టెండర్లు కూడా పూర్తయ్యాయని, ఏడాది లోగా అన్ని వసతులు ఆలయంలో సమకూరుతాయని పేర్కొన్నారు. తనకు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో గుంటూరు జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, కార్యవర్గంతో కలసి పార్టీ నిర్మాణంపై చర్చించనున్నట్లు తెలిపారు. వచ్చేనెల 2న జిల్లాలోని అన్ని గ్రామాల్లో వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, ఘనంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఆనంద శరణాలయంలో అన్నదానం



మంగళగిరి: చినకాకాని షైన్ ఆనంద శరణాలయంలో శనివారం బాలబాలికలకు అన్నదానం నిర్వహించారు. నవులూరు శ్రీనాగేంద్ర స్వామి పుట్టతోట వంశపారంపర్య ధర్మకర్త కాసు లక్ష్మారెడ్డి మూడో వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షైన్ ఫౌండేషన్ చైర్మన్ డీజీ నాయక్ మాట్లాడుతూ లక్ష్మారెడ్డి పుట్టతోట శ్రీనాగేంద్ర స్వామి ఆలయ అభివృద్ధితో పాటు ఎన్నో ఆధ్యాత్మిక, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి భక్తుల ప్రశంసలు పొందారని తెలిపారు. ఆయన ఆధ్యాత్మిక సేవలు నేటి ఆధ్యాత్మిక సంస్థలకు ఆదర్శనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాసు ధనలక్ష్మి, రామకృష్ణారెడ్డి, రత్నకుమారి, భాస్కరరావు, తిరుమల, బుజ్జిబాబు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, ధర్మారావు, శరణాలయం నిర్వాహకురాలు సంధ్యారాణి పాల్గొన్నారు.

కుంచనపల్లిలో రోడ్డు విస్తరణ ప్రారంభం

- చొరవ చూపించిన ఎమ్మెల్యే ఆర్కే, అధికారులు
- రెండు రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు



కుంచనపల్లి నుంచి ప్రాతూరు వెళ్లే రోడ్డు విస్తరణ చేస్తున్న జేసీబీ

తాడేపల్లి రూరల్: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కుంచనపల్లిలో ప్రధాన రహదారి ఇరుకుగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ప్రాతూరు నుంచి కుంచనపల్లి రామమందిరం వరకు రోడ్డు విస్తరణ చేయాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఆయన కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి, రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సూచించారు. దీంతో శనివారం నుంచి కుంచనపల్లిలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. గతంలో కొందరు అభ్యంతరాలు తెలియజేయడంతో కొంతకాలం రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి పలుమార్లు నివాసితులతో మాట్లాడారు. దీంతో రోడ్డు విస్తరణ పనులకు ఒప్పుకుని కొంత మంది సొంత స్థలాల్ని కార్పొరేషన్ అధికారులకు అందజేశారు. వెంటనే నాలుగు వందల మీటర్ల పొడవు, 17 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మించేందుకు కార్పొరేషన్ ప్రత్యేక గ్రాంటు నుంచి కోటి రూపాయిలు కేటాయించారు. మంగళ, బుధ వారాల్లో రోడ్డు నిర్మాణ పనుల్ని చేపట్టనున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. కుంచనపల్లిలో ప్రధాన రహదారి విస్తరణ వల్ల ప్రజల రాకపోకల కష్టాలు తీరనున్నాయి. రోడ్డు విస్తరణ పనులు చేపట్టినందుకు కార్పొరేషన్ అధికారులకు, ఎమ్మెల్యే ఆర్కేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

మండల లీగల్ సెల్ సర్వీసెస్ సర్వసభ్య సమావేశం

మంగళగిరి: మండల లీగల్ సెల్ సర్వీసెస్ సర్వసభ్య సమావేశాన్ని నగరంలోని కోర్టుల ఆవరణలో శనివారం సీనియర్ జడ్జి నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. సెలబ్రేషన్ ఆఫ్ ఎలిమినేషన్ ఆఫ్ చైల్డ్ లేబర్ , ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాంగం ప్రకారం అందాల్సిన ఫలాలు, వికలాంగులు, ఒంటరి మహిళలతో పాటు సమాజంలో అట్టడుగు వర్గాల వారికి, గ్రామాల్లో నిరక్షరాస్యులకు రాజ్యాంగం కల్పించిన అవకాశాల్ని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల క్యాంపెయిన్‌పై శిక్షణ ఇచ్చారు. మండల పారా లీగల్ వలంటీర్స్ మల్లవరపు రామ్మూర్తి, డి. నరసయ్య, రాజాబత్తుల శ్రీనివాసరావుతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

బాబు, లోకేష్, అచ్చెన్నపై పోలీసులకు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న సీతారాం, రాజేష్, జాకీర్ హుస్సేన్

మేడికొండూరు: తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్, జాతీయ అధ్య క్షుడు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడులపై మేడికొండూరు పోలీసులకు శనివారం తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ సీతారాం, మేడికొండూరు మండల కన్వీనర్ సొపాటి రాజేష్, కో–కన్వీనర్ తుపాకుల జాకీర్ హుస్సేన్ ఫిర్యాదు చేశారు. యువగళం పాదయాత్రలో ప్రజల్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా, రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేలా ముగ్గు రూ ప్రేరేపిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తంబళ్లపల్లి, పుంగనూరు, మాచర్ల లాంటి సెన్సిటివ్ నియోజకవర్గాల్లో గొడవలు రేపుతున్నారని తెలిపారు. వెంటనే ఫిర్యాదును పరిగణలోకి తీసుకుని తెలుగుదేశం పార్టీ నాయకులపై తగిన చర్యలు తీసుకోవాలని సీఐ కె.వాసుని కోరారు.

మోదీని గద్దె దించేందుకు ఐక్య పోరాటం

మంగళగిరి: రానున్న 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని మోదీని గద్దె దించేందుకు ఐక్యపోరాటం చేయనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ తెలిపారు. సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన విశాఖ ఉక్కు కేంద్రం నుంచి ప్రారంభమైన బస్సు యాత్ర శనివారం సాయంత్రం మంగళగిరికి చేరుకుంది. ఈ సందర్భంగా నగరంలోని అంబేద్కర్ సెంటర్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.సభలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పాల్గొన్నారు.

అమరావతిపై మార్చిన జగన్

తాడికొండ: అమరావతి నిర్మాణంపై ప్రతిపక్షంలో అంగీకారం తెలిపి అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట మార్చారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. బస్సు యాత్రలో భాగంగా తుళ్లూరు మండలం వచ్చిన ఆయన అమరావతి రైతులతో ముఖాముఖి నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతే రాష్ట్ర రాజధాని అని బస్సుయాత్ర ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ వార్డు సభ్యులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఆర్కే, దుగ్గిరాల వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి: నియోజకవర్గ పరిధి దుగ్గిరాల పంచాయతీ వార్డు సభ్యులు పీతా లక్ష్మి, మల్లారపు శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. నగరంలోని ఆటోనగర్ ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో శనివారం పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు ఇద్దరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే ఆర్కే ఆధ్వర్యంలో నియోజకవర్గంలో మునుపెన్నడూ లేనివిధంగా జరుగుతున్న కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు ఆకర్షితులపై టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరినట్లు పంచాయితీ వార్డు సభ్యులు పీతా లక్ష్మి, మల్లారపు శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం వారు ఎమ్మెల్యే ఆర్కేను పెదకాకానిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అభివృద్ధి పనులకు సంబంధించి తన పూర్తి మద్దతు ఉంటుందని, ప్రజా సమస్యల్ని తన దృష్టికి తీసుకు వచ్చినట్లయితే తక్షణమే సంబంధిత శాఖల అధికారుల ద్వారా పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో దుగ్గిరాల మండల వైఎస్సార్ సీపీ నాయకులు దానబోయిన వెంకటేశ్వరరావు, బాణావత్ వెంకటేశ్వర నాయక్, ఆత్మకూరి నాగేశ్వరరావు, తాడిబోయిన వెంకటరావు, గ్యాలం ఫణీంద్ర, షేక్ నాగూర్, మొహమ్మద్ బాజీ, దాసరి వీరయ్య, శివ గోవిందమ్మ, రత్నం పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో అంతర్జాతీయ ప్రిన్సిపాల్స్ సమ్మేళనం

- 16 దేశాల నుంచి 62 మంది హాజరు
- పరిశోధనాంశాలపై ఎయిమ్స్, ఎస్ఆర్ఎం ఎంవోయూ



ఎంవోయూ కుదుర్చుకుంటున్న ఎస్ఆర్ఎం వైస్ చాన్సలర్ మనోజ్, ఎయిమ్స్ డైరెక్టర్ ముఖేష్

మంగళగిరి: ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో శనివారం అంతర్జాతీయ స్థాయి ప్రిన్సిపాల్స్ సమ్మేళనం నిర్వహించారు. 16 దేశాల నుంచి 62 మంది ప్రిన్సిపాల్స్, విద్యావేత్తలు, విద్యారంగ నిపుణులు హాజరయ్యారు. అంతర్జాతీయ విద్యాసంస్థల్లో అమల్లో ఉన్న విద్యా విధానం, బోధనా పద్ధతులపై నిపుణులు చర్చించారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా అధ్యక్షతన జరిగిన సదస్సుకు మంగళగిరి ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ముఖేష్ త్రిపాఠి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అంతర్జాతీయ స్థాయిలో అమలవుతున్న బోధనా పద్ధతుల్ని భారత్ అందిపుచ్చుకుని అగ్రపథాన పయనిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. రమేష్, ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో తెంటు అనిల్‌కుమార్ గౌరవ అతిథులుగా హాజరై విలువైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంగళగిరి ఎయిమ్స్– ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీల మధ్య మెడికల్ రీసెర్చ్, హెల్త్‌కేర్ అంశాల్లో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) జరిగింది. పత్రాలపై ఎస్ఆర్ఎం వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్, ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ముఖేష్ త్రిపాఠి సంతకాలు చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్, డీన్‌లు రంజిత్ థాపా, డాక్టర్ మహేష్ కుమార్, డాక్టర్ మన్నాథన్, ఐఆర్ అండ్ హెచ్ఎస్ డైరెక్టర్ డాక్టర్ నాగశ్వేత పాల్గొన్నారు.

మండలాభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి



సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, ఎంపీపీ స్వప్న

మేడికొండూరు: మండలాభివృద్ధే ధ్యేయంగా అధికారులంతా పనిచేయాలని జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య తెలిపారు. ఎంపీపీ మన్నవ స్వప్న అధ్యక్షతన శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో పారిశుద్ధ్యం, డ్రైనేజీ పనుల్ని ఎప్పటికప్పుడు చేపట్టి నీటిని తొలగించాలని సూచించారు. అర్హత ఉండి ఇంకా సంక్షేమ పథకాలు అందని వారికి వెంటనే అందేలా అన్ని గ్రామ సచివాలయాల అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. గత మాసంలో జరిగిన సమావేశంలో వివిధ శాఖల అధికారుల దృష్టికి తీసుకు వచ్చిన సమస్యల్ని ఏ మేరకు పూర్తి చేసింది ఎంపీడీవో ప్రభాకరరావు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రస్తుతం శాఖలవారీగా అధికారులు నివేదికల్ని అందజేశారు. జలజీవన పథకాన్ని కమిటీ సభ్యుల నిర్ణయం మేరకు అమలు చేస్తే గ్రామంలో అందరికీ మంచి నీరు పుష్కలంగా అందుతుందని ఎంపీటీసీ భర్త రన్ను హుస్సేన్ సభ దృష్టికి తీసుకువచారు. పేరేచర్ల తెల్లక్వారీ కాలనీకి బరియల్ గ్రౌండ్ లేక ఇబ్బందులు పడుతున్నామని ఎంపీటీసీ సభ్యుడు వల్లెపు శ్రీనివాసరావు తెలిపారు. డోకిపర్రు సర్పంచ్ కొండెపోగు సామ్రాజ్యం గ్రామంలో జోసిల్ పంపు హౌస్ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డుకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. డోకిపర్రు శివారు తురకపాలెంలో గ్రావెల్ రోడ్డు అవసరం ఉందని, విద్యుత్ లైన్లు స్తంభాల నుంచి తక్కువ ఎత్తులో వేలాడుతూ ప్రమాదభరితంగా ఉన్నాయని తెలిపారు. మేడికొండూరు, పేరేచర్ల గ్రామాల్లో విరిగి, వంగిన స్తంభాల్ని మార్చాలని సభ దృష్టికి ఆయా గ్రామాల సర్పంచులు పూల నాగమణి, దేవరకొండ రాజ్‌కుమార్ అధికారుల దృష్టికి తీసుకువాచ్చారు. సంబంధిత శాఖల అధికారుతో యంపీడీవో మాట్లాడారు. సర్వసభ్య సమావేశంలో వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భవనం రాజశేఖర రెడ్డి, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండలంలోని పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

యానిమేటర్ల సమస్యల్ని పరిష్కరించాలి



మాట్లాడుతున్న యానిమేటర్ల సంఘ నాయకులు దెబోరా, రామకృష్ణ, లక్ష్మీనారాయణ


మేడికొండూరు: యానిమేటర్ల సమస్యల పరిష్కారానికి ఈ నెల 23 నుంచి చేపట్టిన యాత్ర శనివారం మేడికొండూరుకు చేరింది. ఈ సందర్భంగా మేడికొండూరు చర్చి దగ్గర జరిగిన సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కసుకుర్తి దెబోరా మాట్లాడారు. మూడు సంవత్సరాల కాలపరిమితి , 45 సంవత్సరాల వయో పరిమితి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులు తగ్గించాలని డిమాండ్ చేశారు. టార్గెట్లు పెట్టి వేధించే పద్ధతి అధికారులు మానుకోవాలని కోరారు. బలవంతంగా కోళ్లు, గొర్రెలు తదితర వాటిని అమ్మించే ప్రయత్నాలు మానివేయాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ యానిమేటర్ల అందరికీ గ్రూపు ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. పదిహేను గ్రూపులులోపు ఉన్నవారికి కూడా వేతనాలు ఇవ్వాలని విన్నవించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షులుగా కనకదుర్గ, కార్యదర్శిగా ఫీరాబి, కోశాధికారిగా జ్యోతి, ఉపాధ్యక్షులుగా ఉదయలక్ష్మి, సహాయ కార్యదర్శిగా శిరీష, గౌరవ అధ్యక్షులుగా బి. రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యానిమేటర్లు ఉడతా భాగ్యలక్ష్మి, నోసిన ప్రసన్న, సంకు శ్రీదేవి, వై. శ్రీదేవి, షేక్ పర్వీన్, బుజ్జి పాల్గొన్నారు.

పేదలకు మదర్ థెరిస్సా సేవలు వెలకట్టలేనివి

తాడికొండ: పేదలకు, రోగులకు మదర్ థెరిస్సా సేవ లు వెలకట్టలేనివని మదర్ థెరిస్సా స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు, విశ్రాంత ఏఎస్ఐ టి. పోలరాజు పేర్కొన్నారు.మదర్ థెరిస్సా 113వ జయంతిని పురస్కరించుకొని తాడికొండ అడ్డరోడ్డులోని కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో భాగంగా మదర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు, కుష్టు రోగులకు ఆమె చేసిన సేవలు కొనియాడారు. మణిపూర్ రాష్ట్రంలో చర్చిలపై దాడుల్ని అరికట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, పలువురు సేవా సంస్థ సభులు పాల్గొన్నారు.

➡ తుళ్లూరు లైబ్రరీ కూడలిలో మదర్ థెరిస్సా ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు, వలంటీర్లకు బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడికొండ: మండలంలోని దామరపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకుడు బెజ్జం సాయిప్రసాద్ ఆధ్వర్యంలో 16 మంది పారిశుద్ధ్య కార్మికులు, వలంటీర్లు, ఆశాలకు బియ్యం పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు నాగేశ్వరరావు చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సాయి ప్రసాద్ అభినందనీయులని కొనియాడారు. పేదలకు సాయం దించేందుకు దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు.